## లక్షణాలుంటే కొవిడ్ పరీక్షలు చేయించుకోవాలి

జూబ్లీహిల్స్,డిసెంబర్27: బస్తీ దవాఖానలలో కరోనా వైద్య పరీక్షలు చేపడుతున్నామని.. లక్షణాలున్న వారు కొవిడ్ పరీక్షలు చేయించుకోవాలని అమీర్‌పేట్ ఎస్‌పిహెచ్‌ఓ డాక్టర్ రేవతి సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలతో పాటు బస్తీ దవాఖానలలో కొవిడ్ పరీక్షలు చేపడుతున్నామని తెలిపారు. బుధవారం యూసుఫ్‌గూడ బస్తీ దవాఖానను సందర్శించి కొవిడ్ పరీక్షలతో పాటు వైద్య సేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా డాక్టర్ రేవతి మాట్లాడుతూ కొవిడ్ లక్షణాలు కనపడిన వెంటనే బస్తీ దవాఖానలలో పరీక్షలు చేయించుకోవాలన్నారు. అన్ని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలతో పాటు బస్తీ దవాఖానలలో కొవిడ్ వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయిని.. కొవిడ్ నిబంధనలు పాటిస్తూ ఈ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ చిన్మయి శ్రీరంగ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

### జిల్లా దవాఖానలో కొవిడ్ పరీక్షలు

కొండాపూర్, డిసెంబర్ 27 : కొవిడ్ కేసులు రోజు రోజుకు పెరుగుతున్నందున్న ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా కొండాపూర్‌లోని జిల్లా దవాఖానలో కొవిడ్ పరీక్షలను నిర్వహిస్తున్నట్లు దవాఖాన సూపరిండెంట్ డాక్టర్ అనురాగిణి రెడ్డి తెలిపారు. బుధవారం 19 మందికి కొవిడ్ పరీక్షలు నిర్వహించగా, పాజిటివ్ కేసులు నమోదు కాలేదన్నారు. ప్రతి ఒక్కరు తప్పనిసరిగా మాస్కు, సోషల్ డిస్టెన్స్‌లను పాటించాలన్నారు. కొవిడ్ లక్షణాలున్న వారు వెంటనే వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.

### ఉద్యోగం ఇప్పిస్తానని మోసం..
### నిలదీసినందుకు దాడి.. కేసు నమోదు

ఎర్రగడ్డ, డిసెంబర్ 27: ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి డబ్బు వసూలు చేయటమే కాకుండా.. మోసపోయానని తెలుసుకున్న అవతలి వ్యక్తి నిలదీయగా దాడికి పాల్పడ్డ ఉదంతం బోరబండ పీఎస్ పరిధిలో చోటు చేసుకున్నది. పోలీసులు తెలిపిన ప్రకారం.. శ్రీరాంనగర్‌కు చెందిన నర్సింహులు, బోరబండ సైట్-3కి చెందిన సమివుల్లాఖాన్‌లు స్నేహితులు. ఐతే సచివాలయంలో ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మబలికిన సమివుల్లాఖాన్ నర్సింహులు వద్ద డబ్బు వసూలు చేశాడు. నెలలు గడుస్తున్నా కాలయాపన చేస్తున్న సమిఉల్లాఖాన్‌పై నర్సింహులుకు అనుమానం వచ్చింది. మంగళవారం బోరబండలోని అతని ఇంటికి వెళ్లిన నర్సింహులు సమిఉల్లాఖాన్‌ను నిలదీశాడు. ఇద్దరి మధ్య వాగ్వాదం చోటు చేసుకున్నది. ఆగ్రహం పెంచుకున్న సమిఉల్లాఖాన్ పైపుతో నర్సింహులుపై దాడి చేశాడు. ఈ ఘటనలో నర్సింహులు చేయికి గాయమైంది. బాధితుని ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

### వైభవంగా అయ్యప్పస్వామి విగ్రహ ఊరేగింపు



ఎర్రగడ్డ, డిసెంబర్ 27: బోరబండ సైట్-2లోని హరిహర పుత్ర అయ్యప్ప స్వామి ఆలయ 15వ వార్షిక మండల పూజా మహోత్సవాలు నేటితో ముగిశాయి. మూడు రోజులుగా కొనసాగిన ఈ ఉత్సవాల్లో భాగంగా చివరి రోజు అయ్యప్పస్వామి విగ్రహ ఊరేగింపును పురవీధుల్లో నిర్వహించారు. ఈ ఊరేగింపు మత సామరస్యాన్ని చాటింది. ఊరేగింపు మార్గంలో ముస్లిం సోదరులు వేదికను ఏర్పాటు చేసి దీక్షలో ఉన్న అయ్యప్ప భక్తులకు నీటి బాటిళ్లను అందజేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు జి.లక్ష్మణ్‌గౌడ్, కమిటీ ప్రతినిధులు శివకుమార్ గుప్త, గోపాలకృష్ణ, సురేశ్, ప్రవీణ్, బాలకృష్ణ, కాశీరావు, విజయ్, సత్యనారాయణ, తివారి, నాగరాజు, అంజయ్య, సంజీవరెడ్డి, ప్రసాద్ పాల్గొన్నారు.

### సెన్సార్ బోర్డ్ మెంబర్ అక్కల సుధాకర్‌కు సన్మానం



జూబ్లీహిల్స్, డిసెంబర్27: సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ అడ్వైజరీ (సెన్సార్) బోర్డు మెంబర్‌గా నియామకమైన అక్కల సుధాకర్‌ను నగర మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, రాజ్యసభ సభ్యులు కె.లక్ష్మణ్, ఫిలిం ఛాంబర్ అధ్యక్షుడు సునీల్ నారంగ్, ప్రముఖ నిర్మాత అభిషేక్ నామ తదితరులు ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

# పట్టాలెక్కనున్న ప్రజాపాలన..

- నేటినుంచి పథకాలకు దరఖాస్తుల స్వీకరణ
- వార్డుకు నాలుగు కమిటీలు.. నాలుగు కౌంటర్ల ఏర్పాటు
- ఒక్కో కమిటీలో 8 మంది అధికారులు

జూబ్లీహిల్స్,డిసెంబర్27: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీలో ప్రకటించిన 6 గ్యారంటీల పథకాల అమలుకు కార్యాచరణ ప్రారంభంకానుంది. ఈ మేరకు నేటినుంచి నిర్వహించనున్న ప్రజా పాలనకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఇందుకుగానూ జీహెచ్ఎంసీ 19వ సర్కిల్‌లో వార్డు కమిటీల ఏర్పాటు చేపట్టారు. యూసుఫ్‌గూడ సర్కిల్‌లో 5 వార్డులకు గానూ 24 కమిటీలను ఏర్పాటుచేశారు. ప్రజల సంక్షేమానికి ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాల వివరాలను తెలియచేస్తూ వారి నుంచి దరఖాస్తులు స్వీరించాలని జీహెచ్ఎంసీ జాయింట్ కమిషనర్, స్పెషల్ ఆఫీసర్ ఎ.శైలజ అధికారులకు సూచించారు. బుధవారం యూసుఫ్‌గూడ పోలీస్ బెటాలియన్‌లోని మంజీరా కమ్యూనిటీహాల్‌లో డిప్యూటీ కమిషనర్ సేవా ఎస్లావత్ అధ్యక్షతన ప్రజా పాలన సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్, కార్పొరేటర్లు రాజ్‌కుమార్ పటేల్, సీఎన్ రెడ్డి, దేదీప్యరావులతో పాటు పలువురు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. కాగా నేటినుంచి జరుగనున్న ప్రజా పాలన కార్యక్రమంలో యూసుఫ్‌గూడ, రహ్మత్‌నగర్, వెంగళరావునగర్, బోరబండ, ఎర్రగడ్డ డివిజన్లలో సంబందిత



ప్రజాపాలన సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్

వార్డు కమిటీలు దరఖాస్తులు స్వీకరించనున్నాయి. ఒక్కో వార్డులో 4 కమిటీలతో ఏర్పాటుచేసిన ప్రజా పాలన కౌంటర్‌లలో అధికారులు ప్రజల నుంచి విజ్ఞప్తులను స్వీకరిస్తారని అధికారులు తెలిపారు. ఒక్కో వార్డు కమిటీలో 8 మంది అధికారులు ప్రజల దరఖాస్తులు స్వీకరిస్తారు. ఇందుకుగానూ చేపట్టాల్సిన విధివిధానాలపై అధికారులకు దిశా నిర్ధేశం చేశారు. ఈ కార్యక్రమంలో సర్కిల్‌లోని అన్ని విభాగాల హెచ్‌ఓడీలు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

**ప్రజా పాలనలో పథకాలను సద్వినియోగం చేసుకోవాలి.**

ప్రజా పాలనలో రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న వివిధ పథకాలను లబ్దిదారులు సద్వినియోగం చేసుకోవాలని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్ పేర్కొన్నారు. బుధవారం ప్రజాపాలన స్పెషల్ ఆఫీసర్ శైలజ ఆధ్వర్యంలో యూసుఫ్‌గూడ పోలీస్ బెటాలియన్‌లోని మంజీరా కమ్యూనిటీహాల్‌లో డిప్యూటీ కమిషనర్ సేవా ఎస్లావత్ అధ్యక్షతన ప్రజా పాలన సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మాట్లాడుతూ.. నేటినుంచి రాష్ట్ర ప్రభుత్వం అమలుచేయనున్న అభయ హస్తం తదితర అన్ని పథకాల గురించి ప్రజలకు వివరించడంతో పాటు వారికి లబ్ధి చేకూరేలా దరఖాస్తులు చేయించాలన్నారు. పథకాలు ఇప్పిస్తామని ఎవరైనా డబ్బులు వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని.. మధ్యదళారుల మాటలు నమ్మకుండా ప్రజలు నేరుగా అధికారుల వద్దకు వెళ్లి దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు సంతోష్, బోరబండ డివిజన్ కో ఆర్డినేటర్ విజయసింహారెడ్డి, నాయకులు నర్సింగ్‌దాస్, వేణు, పలువురు ప్రజా ప్రతినిధులు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

# లబ్ధిదారులకు పథకాలు అందేలా కృషి



జోనల్ కార్యాలయంలో ప్రజాపాలనపై సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

మియాపూర్, డిసెంబర్ 27 : ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రజలందరికీ అందించేలా కృషి చేస్తానని ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. ప్రజల జీవితాలలో వెలుగులు నింపే వీటిని వినియోగించుకోవాలని, జనాభా ప్రాతిపదికన అవసరమైతే అదనంగా కేంద్రాలను సైతం ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. నేటి నుంచి జనవరి 6 వరకు నిర్వహించనున్న ప్రజా పాలన కార్యక్రమంపై జోనల్ కార్యాలయంలో అధికారులు నవీన్‌రెడ్డి, మల్లయ్య, కోటేశ్వర్‌రావు, శ్రీవాణి, డీసీలు రజనీకాంత్‌రెడ్డి, వంశీకృష్ణ, కార్పొరేటర్లు హమీద్ పటేల్, రాగం నాగేందర్, దొడ్ల వెంకటేశ్ , జగదీశ్వర్ గౌడ్, నార్నె శ్రీనివాస్‌రావు, ఉప్పలపాటి శ్రీకాంత్, మంజులరెడ్డి, రోజాదేవి, పూజిత గౌడ్, మాజీ కార్పొరేటర్ సాయిబాబాలతో కలిసి బుధవారం నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే గాంధీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రకటించిన పథకాలపై డిసెంబరు 6 వరకు డివిజన్‌లలో ఏర్పాటు చేస్తున్న కేంద్రాలలో ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తానని, ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పెద్ద సంఖ్యలో ప్రజలు దరఖాస్తుకు ముందుకు వచ్చే అవకాశం ఉన్నందున కేంద్రాలలో ఎటువంటి అసౌకర్యం లేకుండా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే గాంధీ సూచించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పని చేసి ప్రజలకు అవగాహన కలిగేలా, లబ్ధి జరిగేలా చూడాలని పేర్కొన్నారు. ఎన్నికల వరకే పార్టీలని, పథకాలను పార్టీలకు అతీతంగా అర్హులకు అందేలా కృషి చేయాలని తెలిపారు. సంక్షేమ పథకాలతో పాటు సమస్యలపైనా దరఖాస్తుల స్వీకరణకు కేంద్రాలను ఏర్పాటు చేయాలని, ప్రజల నుంచి డిమాండ్ నేపథ్యంలో అవసరమైతే గడువును పొడిగించాలని ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రజాప్రతినిధులు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

### ప్రజా పాలన ఏర్పాట్లు పరిశీలించిన కార్పొరేటర్



మధురానగర్ కమ్యూనిటీహాల్‌లో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కార్పొరేటర్ దేదీప్య రావు

వెంగళరావునగర్, డిసెంబర్ 27 : జవహర్ నగర్, మధురానగర్‌లో నేటి నుంచి జరగనున్న ప్రజా పాలన ఏర్పాట్లను వెంగళరావునగర్ కార్పొరేటర్ దేదీప్య రావు బుధవారం పరిశీలించారు. జవహర్ నగర్ ఎస్సీ హాస్టల్ లో జరిగే ప్రజాపాలనలో జవహర్‌నగర్, ఏజీ కాలనీ, లక్ష్మి నగర్ ప్రాంతాల ప్రజల నుంచి దరఖాస్తులను అధికారులు స్వీకరిస్తారని ఆమె తెలిపారు. రహ్మత్ నగర్, యాదగిరి నగర్ వాసుల కోసం అంబేద్కర్ కమ్యూనిటీహాల్‌లో ప్రభుత్వం దరఖాస్తులు తీసుకుంటుందని.. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ సేవ ఇస్లావత్, ఈ.ఈ రాజ్‌కుమార్, డీ.ఈ రాంచంద్ర రాజు, తదితరులు పాల్గొన్నారు.

### హామీల అమలుకు పోరాట పంథాలో సాగుదాం..



పార్టీ శ్రేణుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గాంధీ

మియాపూర్, డిసెంబర్ 27 : కుల మత ప్రాంతాలకు అతీతంగా ప్రజలందరి ఆదరణ పార్టీ శ్రేణుల విశేష కృషి వల్లే తాను మూడు పర్యాయాలు ఎమ్మెల్యే గా గెలుపొందినట్లు ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ పేర్కొన్నారు. ప్రతిపక్షంలో ఉన్న తాను ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలుకు ప్రజలతో కలిసి పోరాట పంథాతో ముందుకు సాగుతానని పేర్కొన్నారు. నియోజకవర్గంలోని కొండాపూర్, గచ్చిబౌలి, శేరిలింగంపల్లి, చందానగర్, మియాపూర్, మాదాపూర్, హఫీజ్‌పేట్, భారతీనగర్ డివిజన్‌లకు చెందిన పార్టీ నేతలు కార్పొరేటర్లు హమీద్ పటేల్, రాగం నాగేందర్, ఉప్పలపాటి శ్రీకాంత్, మంజులరెడ్డి, మాజీ కార్పొరేటర్ సాయిబాబాతో కలిసి వివేకానందనగర్‌లోని తన నివాసంలో బుధవారం సాయంత్రం నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే గాంధీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో పార్లమెంటు ఎన్నికలు జరగనున్న తరుణంలో బీఆర్ఎస్ పార్టీ సత్తా చాటాలని, నియోజకవర్గం నుంచి అధిక మెజార్టీని అందించేందుకు సైనికుల్లా కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయా డివిజన్ల పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

- ఎమ్మెల్యే అరెకపూడి గాంధీకి అభినందనల వెల్లువ కొనసాగింది. హైదర్‌నగర్ డివిజన్ హెచ్ఎంటీహిల్స్ నూతన కార్యవర్గ సభ్యులు, సహా పార్టీ నేతలు, ప్రతినిధులు ఎమ్మెల్యే గాంధీని ఆయన నివాసంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

**PUBLIC NOTICE**

This is to inform the general public that **A.Shailaja** is the owners of Flat No. G-3, Ground Floor, Built up area 955 Sft, with an undivided share of land admeasuring 31.51 Sq.yds., out of 748 Sq.yds., M.No.5-18/G-3, Premises No.5-18, Situated at Raidurg Khalsa Village, Serilingampally Mandal, Ranga Reddy District., who acquired the same vide Registered gift settlement deed no. 8515/2019 dated 29-11-2019. The original link Registered Gift Settlement Deed No. 4066/2012 dated 07-06-2012 is lost. Whosoever has found the above mentioned original document and whoever has got any claims or rights over the above mentioned property. Please contact J.Sivanesan, Advocate, Contact No. 9393099915 within 10 days from date of publication of this notice.

### ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్‌ను కలిసిన నేతలు



బోరబండ డివిజన్ రాజ్‌నగర్ బస్తీ సంక్షేమ సంఘం నాయకులు బుధవారం ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్‌ను కలిశారు. బస్తీ అభివృద్ధికి ఎంతో సహకరించిన మాగంటికి రుణపడి ఉంటామని అధ్యక్షుడు జైభీమ్ యాదగిరి పేర్కొన్నారు. ఎమ్మెల్యేగా హ్యాట్రిక్ విజయాన్ని సాధించిన గోపీనాథ్‌ను శాలువాతో సన్మానించారు. యాదగిరితో పాటు ప్రధాన కార్యదర్శి సుధాకర్, అనిల్‌కుమార్, లక్ష్మణ్, డివిజన్ కోఆర్డినేటర్ విజయసింహ పాల్గొన్నారు.

– ఎర్రగడ్డ, డిసెంబర్ 27

### ఆకట్టుకున్న నృత్య ప్రదర్శనలు



మాదాపూర్‌లోని శిల్పారామంలో కొనసాగుతున్న ఆల్ ఇండియా క్రాఫ్ట్స్ మేళాలో భాగంగా బుధవారం పలువురు నృత్యకారులు సాంస్కృతిక ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. ఇందులో భాగంగా దుర్గేశ్ నందిని తన శిష్య బృందం, ప్రణవి తుమ్మటి శిష్య బృందాలు నర్తించిన కూచిపూడి నృత్యాలు సందర్శకులను ఆద్యాంతం ఆకట్టుకున్నాయి.

– కొండాపూర్, డిసెంబర్ 27